అమ్మకానికి ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్

- ప్రభుత్వం నిర్ణయం
- 20న నోటిఫికేషన్‌కు సన్నాహాలు
- భగ్గుమంటున్న నివాసితులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు
- ప్రభుత్వ చర్యను అడ్డుకునేందుకు తలసానితో కలిసి ప్రణాళిక

అమీర్‌పేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు పరిధిలోని రాజీవ్‌స్వగృహ, హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల గృహ నిర్మాణ శాఖ అధికారి జ్యోతిబుద్ధప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతమ్ ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం కూడా తెలిపింది. ఈనెల 20న నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగ వేలం ద్వారా రూ.3,500 కోట్లకు పైగా వచ్చే అవకాశాలు ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వెల్లడించినట్లు తెలిసింది. ఈ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు, ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు మధ్యతరగతి గృహ నిర్మాణాలకు ఉపయోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. ఇందులో ఎస్ఆర్‌నగర్‌లో 90 శాతం నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న మల్టీలెవల్ కమ్యూనిటీ హాల్ కూడా ఉండడంతో స్థానిక నివాసితులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్నారు.

తలసాని చొరవతో నిధులు

పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో చౌకగా ఉంటుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని నిర్మాణ పనులకు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మల్టీలెవల్ కమ్యూనిటీ హాల్‌లో రెండు సెల్లార్లు ఏర్పాటు చేసేందుకు మట్టిని తవ్వగా అడుగు భాగంలో రాతి పొరలు రావడం, భారీ వర్షాలతో పనులు చేయడంలో పలు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ రెండు సెల్లార్లు, రెండు ఫ్లోర్లతో నిర్మాణం పూర్తి చేసుకుంది. 90 శాతం పనులు పూర్తి చేసుకుని మరికొన్ని రోజుల్లో అందుబాటులోకి వస్తుందనుకుంటున్న నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నిధుల విడుదలకు బ్రేక్ పడింది. నూతనంగా ప్రభుత్వం ఈ కమ్యూనిటీ హాల్‌ను బహిరంగ వేలం వేసేందుకు రంగం సిద్ధం చేయడంతో అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, బాపునగర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ చర్యను ఎమ్మెల్యే తలసానితో కలిసి అడ్డుకుంటామని నివాసితులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మాజీ కార్పొరేటర్ శేషుకుమారిని కలిసి తాము చేయతలపెట్టిన ఆందోళనకు మద్దతు పలకాలని నివాసితులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరారు.





కమ్యూనిటీ హాల్ నమూనా చిత్రం

నిధులు లేక అసంపూర్తిగా ఉన్న ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్

ఆధునిక హంగులు.. అధునాతన సౌకర్యాలతో..

ఎస్ఆర్‌నగర్‌లో ఆధునిక హంగులు అధునాతన సౌకర్యాలతో రూ.11.92 కోట్లతో రెండు సెల్లార్లు, రెండు ఫ్లోర్లను నిర్మించారు. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎన్ని అవరోధాలు వచ్చినప్పటికీ తలసాని దీనిపై ప్రత్యేక దృష్టి సారించి హౌసింగ్ బోర్డు ఆధీనంలోని 3185 గజాల సువిశాల స్థలంలో మోడ్రన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. వాస్తవానికి సంవత్సర కాలంలో పూర్తి కావాల్సిన కమ్యూనిటీ హాల్ రాతి పొరలు అడ్డు రావడం, 2023లో విపరీతంగా కురిసిన వర్షాల కారణంగా పనుల్లో వేగం తగ్గింది. ఎట్టకేలకు 90 శాతం పనులను పూర్తి చేసుకుంది. 10,494 ఎస్ఎఫ్‌టీ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్, 1,179 ఎస్ఎఫ్‌టీలో ఫస్ట్ ఫ్లోర్ 12,958 ఎస్ఎఫ్‌టీలో సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ నిర్మించాల్సి ఉండగా, నిధుల లేమితో ఈ పనులను తాత్కాలికంగా నిలిపేశారు. ప్రధానంగా 5456.56 స్క్వేర్ ఫీట్ల స్థలంలో డైనింగ్ హాల్, 4142.59 స్క్వేర్ ఫీట్ల స్థలంలో హాల్, 1434.02 స్క్వేర్ ఫీట్ల స్థలంలో వాణిజ్య సముదాయాలు, సెల్లార్ నుంచి రెండు ట్రైక్వెన్సీ లిఫ్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాణిజ్య కేంద్రమైన అమీర్‌పేటలో సామాన్యుడు శుభకార్యాలు చేసుకునేందుకు చౌకధరలో ఫంక్షన్‌హాళ్లు అందుబాటులో లేక చాలీచాలనీ కమ్యూనిటీ హాళ్లలో కార్యాలు చేసుకుంటున్నారు. ఇది అందుబాటులోకి వస్తే తక్కువ ఖర్చుతో ధనవంతులు విలాసవంతంగా చేసుకునే హోటళ్లను తలదన్నే రీతిలో పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండనుంది. కమ్యూనిటీ అడుగు భాగాన 18,535 స్క్వేర్ ఫీట్ల స్థలం మొదటి సెల్లార్‌లో 35 కార్లు, 26 బైక్‌లు, రెండో సెల్లార్‌లో 34 కార్లు, 22 బైక్‌లు పార్క్ చేసే విధంగా నిర్మించారు. ఇంతటి సౌకర్యాలు కలిగిన ఈ కమ్యూనిటీ హాల్‌ను అమ్మకానికి పెట్టడం పట్ల పలు వర్గాలు ప్రభుత్వ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

అమ్మకానికి పెడితే ఆందోళన ఉధృతం

90 శాతం నిర్మాణాలు పూర్తి చేసుకుని స్థానికులకు అందుబాటులోకి రానున్న ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను అమ్మకానికి పెడితే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తాం. స్థానిక నివాసితులకు హౌసింగ్ బోర్డు స్థలం కేటాయించినప్పటికీ గతంలో కమ్యూనిటీ హాల్‌ను జీహెచ్ఎంసీ నిర్మించింది. ఈ స్థలంపై సర్వ హక్కులు నివాసితులకే ఉన్నాయి. దీని చుట్టుపక్కల అనేక కాలనీలు, బస్తీల్లో వేలాది మంది పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కమ్యూనిటీ హాల్‌ను వేలం వేస్తే ప్రజాగ్రహం చూడాల్సి వస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలి.

- సుధాకర్‌రెడ్డి, ఎస్ఆర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

పేదలకు ఉపయోగపడే స్థలాల జోలికి రావద్దు

పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే స్థలాలు, కమ్యూనిటీ హాళ్ల అమ్మకాలకు ప్రభుత్వం పూనుకోవడం మంచిది కాదు. రాష్ట్రానికి కావాల్సిన ఆదాయ మార్గాలు ఎన్నో ఉన్నప్పటికీ నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి రానున్న ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను వేలం వేయాలని చూడడం దురదృష్టకరం. ఇలాంటి చర్యలను నేను ఎన్నడూ చూడలేదు. ఎన్నో సంవత్సరాలుగా నివాసితుల ఆధీనంలో ఉన్న ఈ కమ్యూనిటీ హాల్ విక్రయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి

- పెంటయ్యగుప్తా, కోశాధికారి ఎస్ఆర్‌నగర్ సంక్షేమ సంఘం



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న డాక్టర్ పద్మజారెడ్డి

డి సన్స్ పటోలా వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్.1 లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారతీయ కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్నమైన పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సందర్శించి, మరింత ప్రోత్సహించాలని కోరారు. డి సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ ఈనెల 20 తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా పటాన్ పటోలా, బంధాని, బనారసి, మహేశ్వరి, జరీ కోట, చందేరి, కాశ్మీరీ నేత వస్త్రాలు, లక్నోవి, అజ్రక్ చీరలు, డ్రెస్ మెటీరియళ్లు, కుర్తీలు, బెడ్‌షీట్లతో పాటు ఆభరణాలు వంటి 10 వేల రకాల వస్త్రోత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన సామాజిక లక్ష్యమని పేర్కొన్నారు.

ఖైరతాబాద్ గణపతి వద్ద పనులను అదనపు డీసీపీ ఆనంద్ పరిశీలించారు. గణపతి వద్ద భద్రతతో పాటు పలు అంశాలపై ఉత్సవ కమిటీ ప్రతినిధులు రాజ్‌కుమార్, మహేష్‌యాదవ్, సందీప్‌రాజ్‌తో చర్చించారు.

● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి



తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

ఖైరతాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని ఖైరతాబాద్ పోలీసులు క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పగించారు. బంజారాహిల్స్ శ్రీరామ్‌నగర్ కాలనీకి బీహార్‌కు చెందిన ఓ కుటుంబం ఇటీవలే ఒకసారి వచ్చింది. ఆ కుటుంబానికి చెందిన ఆశిష్ కుమార్(8) సోమవారం ఉదయం ఇంటి నుంచి తప్పిపోయి ఖైరతాబాద్‌కు వచ్చి ఏడుస్తుండగా స్థానికులు పోలీసులకు అప్పగించారు. బాలుడు ఇంటి చిరునామా, కుటుంబసభ్యుల ఫోన్ నంబర్లు చెప్పలేకపోవడంతో ఎస్ఐ శ్రీరాములు అన్ని బస్తీలకు బాలుడిని తీసుకొని వెళ్లి విచారించారు. చివరకు బంజారాహిల్స్ వెళ్లగా బాలుడి కోసం వెతుకుతూ చివరకు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన కుటుంబసభ్యులు పిల్లోడిని చూసి ఆనందం వ్యక్తం చేశారు. బాలుడిని క్షేమంగా తమకు అప్పగించిన ఖైరతాబాద్ పోలీసులను బీహార్ కుటుంబం అభినందించింది.



ఆశిష్ కుమార్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీరాములు



ఫాదర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్యాంపెయిన్‌కు హాజరైన పోలీసులు

పురుషుల్లో సంతానలేమికి కారణాలపై అవగాహన

బంజారాహిల్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఫాదర్స్ డేను పురస్కరించుకొని పురుషుల్లో సంతాన లేమికి గల కారణాలు, అపోహలను తొలగించేందుకు బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆస్పత్రి వారు జనని యాత్ర పేరిట సోమవారం క్యాంపెయిన్ నిర్వహించారు. అదనపు డీసీపీ రాములు క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలపై విధి నిర్వహణలో ఉన్న పోలీసులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వాకర్లు, ట్రాఫిక్ పోలీసులు, ఒయాసిస్ ఫెర్టిలిటీ సైంటిఫిక్ హెడ్, క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణచైతన్య పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ యువతి ఈనెల 14న మార్కెట్‌కు వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో సోదరుడు నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ నందినగర్, సెరికల్చర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ న్యాయవిహార్, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, బీఎస్ మక్తా ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ వనమాల రెసిడెన్సీ, ఎఫ్‌సీఐ గోడౌన్, శాంతి శిఖర అపార్ట్‌మెంట్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి

బంజారాహిల్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అసదుద్దీన్‌కు ఆ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. అసదుద్దీన్‌ను టీపీసీసీ జనరల్ సెక్రటరీగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన మహేశ్‌గౌడ్‌ను సోమవారం కలిశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అందరిని కలుపుకుపోతూ బలమైన పార్టీగా మార్చే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మహ్మద్ అసదుద్దీన్

ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన ట్రస్టుబోర్డు సభ్యులు

బంజారాహిల్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం ట్రస్టు బోర్డు సభ్యులుగా శ్రీనగర్‌కాలనీకి చెందిన సుదర్శన్‌రెడ్డి, సందిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కోనేరు సాయిప్రసాద్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హెల్త్ అడ్వయిజరీ కుటుంబానికి చెక్కు అందజేత

అమీర్‌పేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా 104 ప్రాజెక్ట్‌లో హెల్త్ అడ్వయిజరీ జిశైలజమోహన్ రెండు నెలల క్రితం తీవ్ర అనారోగ్యంతో మృతిచెందింది. ఈమె కుటుంబసభ్యులకు ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ స్టేట్ హెడ్ సుధాకర్, తెలంగాణ స్టేట్ హెచ్ఆర్ హెడ్ కిరణ్ కిశోర్ సంస్థ ముఖ్య కార్యాలయంలో రూ. 5 లక్షల చెక్కును సోమవారం అందజేశారు.



శైలజమోహన్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న కిరణ్ కిశోర్

శెట్టి బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

బేగంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శెట్టి బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి సోమవారం ప్రజా భవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ జాబితాలో శెట్టి బలిజ కులం ఉందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీసీ జాబితా నుంచి తొలగించారని వారు పేర్కొన్నారు. టైపు మిస్టేక్ వల్ల పొరపాటు జరిగిందని తెలంగాణ బీసీ కమిషన్ అభిప్రాయపడిందని, దీనిని సరిదిద్దాలని బీసీ శాఖ కార్యదర్శికి కమిషన్ మెంబర్ సెక్రటరీ లేఖ రాశారని సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, గణపతి, ప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చిన్నారెడ్డి పేర్కొన్నారు.



చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శెట్టి బలిజ సంఘం ప్రతినిధులు

రోడ్డు లేని స్థలంలోకి వెళ్లేది ఎలా?

హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట నిరసన

బంజారాహిల్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు స్థలాలు కేటాయించి అందులోకి వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఘట్‌కేసర్ పరిధి కొండాపూర్ లబ్ధిదారులు అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నగరం చుట్టూ జరిగిన ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో వివిధ ప్రాంతాలకు చెందిన తాము భూములు కోల్పోయినట్టు చెప్పారు. ప్రభుత్వం నిర్వాసితులందరికీ ఘట్‌కేసర్ సమీపంలోని కొండాపూర్ గ్రామ శివారులోని 276 సర్వే నెంబర్‌లో గల ఎత్తైన కొండ ప్రాంతాన్ని రాళ్లు, రప్పలతో నిండిన గుట్టలను కేటాయించిందన్నారు. ఇందులో 100 ఎకరాల ప్రభుత్వ భూమిని 2008లో గుర్తించి బొల్లినేని సీనయ్య అండ్ కంపెనీ గుత్తేదారుకు 30 శాతం, నిర్వాసితులకు 70 శాతం ప్లాట్లు తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. సదరు కాంట్రాక్ట్ తీసుకున్న కంపెనీ సద్గంగా డెవలపర్స్ అనే సంస్థకు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చిందన్నారు. 2008లో పనులు ప్రారంభించిన సదరు సంస్థ 2011లో తూతూ మంత్రంగా పనులు చేసి ప్లాట్ల రాళ్లపాతి కొద్దిపాటి రోడ్లను వేసి ప్రభుత్వానికి అప్పగించిందన్నారు. తమ వాటాగా వచ్చిన సుమారు 30 ఎకరాల భూమిని ప్లాట్లుగా చేసి ఒప్పందంలో ఉన్న డెవలప్‌మెంట్ ఏమీ చేయకుండానే అమ్ముకున్నారని ఆరోపించారు. హెచ్ఎండీఏ అధికారులను మచ్చిక చేసుకుని మధ్యలోనే ప్రాజెక్ట్ వదిలేశారని ఆరోపించారు. దీంతో తమ స్థలాల్లోకి వెళ్లేందుకు రోడ్డు మార్గం కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఘట్‌కేసర్ వాసులు

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మించేనా?

- ప్రతిపాదనలకే పరిమితమైన పనులు

ఖైరతాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా నిర్మించ తలపెట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం స్థానికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా పనులు ముందుకు కదలడం లేదు. హెచ్ఎండీఏ ఆధీనంలోని ఈ స్థలాన్ని ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం జీహెచ్ఎంసీకి బదిలీ చేయాల్సిన అవసరం ఉంది. ఆ ప్రతిపాదనలే అందలేదని హెచ్ఎండీఏ చెబుతున్న నేపథ్యంలో హామీ ఇచ్చిన ప్రజా ప్రతినిధులు ఎంతవరకు దీనిని నెరవేరుస్తారన్న సందేహంలో ఖైరతాబాద్ వాసులు ఉన్నారు.

హెచ్ఎండీఏ ఆధీనంలో దాదాపు ఎకరం స్థలం

ఐమాక్స్ ఎదురుగా కే ఆకారంలో పొడవుగా దాదాపు ఎకరం స్థలం ఉంది. గతంలో హుస్సేన్‌సాగర్‌లో అంతర్భాగంగా ఉన్న ఈ స్థలం ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) ఆధీనంలో ఉంది. సాగర్ పరీవాహక ప్రాంతాన్ని ఆనుకొని వెలసిన ఎన్నో బస్తీలు, కాలనీల్లో వేలాది మంది జీవిస్తుండగా పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున ఫంక్షన్ హాల్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇందిరానగర్ కాలనీ, డబుల్ బెడ్ రూమ్ సముదాయాలు, బీజేఆర్‌నగర్, బుడగజంగం బస్తీ, మారుతీనగర్, నెహ్రూనగర్, గాంధీనగర్, న్యూ సీఐబీ క్వార్టర్స్, పార్థీవాడ, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో 90 శాతం వరకు పేద, మధ్యతరగతి ప్రజలే నివసిస్తున్నారు. వీరందరూ గర్వంగా శుభకార్యాలను వైభవంగా చేసుకునేందుకు వీలుగా 3 సంవత్సరాల క్రితం స్థానికుల అభ్యర్థన మేరకు ఇక్కడ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించాలనే ప్రతిపాదన వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రతిపాదనకు అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సైతం అంగీకారం తెలపడంతో వెంటనే పనులు ప్రారంభమవుతాయని స్థానికులు భావించినా, సంబంధిత ప్రతిపాదనలు సమయానికి వెళ్లకపోవడంతో ముందుకు సాగలేదు. కనీసం హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం జీహెచ్ఎంసీకి బదలాయించాల్సిన విషయమై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటికోసం కనీస ప్రతిపాదనలు కూడా రాలేదని సంబంధిత అధికారులు చెబుతుండడం విశేషం.

ఎమ్మెల్యే తలుచుకుంటే..

గతంలో నగరంలో చక్రం తిప్పి రాష్ట్ర మంత్రిగా పనిచేసి తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ మధ్య హడావిడి తగ్గించారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉన్న ఆయన తలుచుకుంటే పనులు సులువుగా జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్ని పనులతోపాటు ఖైరతాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను త్వరగా నిర్మించి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉన్నది.



ఖైరతాబాద్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ కోసం ఎంచుకున్న స్థలం



మర్యాద పూర్వక కలయిక

జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.
- తార్నాక, ఆంధ్రజ్యోతి



పరిచయ సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ రవికిరణ్, అధికారులు

జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల సమావేశం

సికింద్రాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులతో జరిగిన పరిచయ సమావేశంలో పాల్గొన్నారు. వర్షాకాలంలో నాలాల పూడిక తీయటం, భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించడం, అలాగే పడిపోయిన చెట్లను తొలగించటం తదితర పనులు జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు సమన్వయంతో చేపట్టాలని నిర్ణయించారు. ఆయా విభాగాల మధ్య సమన్వయం కోసమే ఈ పరిచయ సమావేశాన్ని ఏర్పాటు చేశామని జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారి వై.గౌతమ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్ పి.దత్తు, వి.సుభాష్‌రెడ్డి, జీబీ చంద్రశేఖర్, జీహెచ్ఎంసీ అధికారులు ఆశాలత, రామాంజనేయరెడ్డి, మారుతీదివాకర్, జి.రాజు, సుభాష్ రావు, దాకునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ వీడ్కోలు

ద.మ.రైల్వే ఎంప్లాయిస్ కేంద్ర కార్యాలయంలో సోమవారం జూన్ చివరిలో విరమణ చేయనున్న జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వేమెన్, ద.మ.రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య, భరణీ భానుప్రసాద్, షేక్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.
- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి



బౌద్ధనగర్‌లో రోడ్డుపై కుంగిపోయిన మ్యాన్‌హోల్స్

కుంగుతున్న మ్యాన్‌హోల్స్.. పట్టించుకోని అధికారులు

బౌద్ధనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్‌లో మ్యాన్‌హోల్స్ కుంగి, పదిరోజుల నుంచి మ్యాన్‌హోల్స్ కుంగి రోడ్డుపై మురుగు పారుతోందని, అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బౌద్ధనగర్ ఎస్ఎంఆర్ కాంప్లెక్స్ నుంచి కౌసర్ మసీదుకు వెళ్లే రహదారిపై మ్యాన్‌హోల్స్ కుంగి ప్రమాదకరంగా మారిందని, ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. పలు సమస్యలు నెలకొంటున్నా స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మ్యాన్‌హోల్స్‌కు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైలుకు ఎదురుగా వచ్చి ఆత్మహత్య



బిల్లా

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా ఓ వ్యక్తి రైలుకు ఎదురుగా వచ్చి ఆత్మహత్య చేసుకున్న ఘటన వినాయక్‌నగర్ ప్రాంతంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం వినాయక్‌నగర్ ప్రాంతానికి చెందిన బిల్లా(38) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య భార్యాభర్తల మధ్య గొడవలు, మద్యానికి అలవాటు పడ్డ బిల్లా సోమవారం అమ్మగూడ-మౌలాలి సమీపంలోని వినాయక్‌నగర్ వద్ద లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రభుత్వ కళాశాలలో సదుపాయాలు కల్పించాలి

- సికింద్రాబాద్ న్యూ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో అరకొర గదులు, ఆటస్థలం కరువు

రెజిమెంటల్‌బజార్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కాలేజీల్లో ఫీజులు చెల్లించే స్థోమత లేక ప్రభుత్వ కాలేజీల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇక్కడ సుశిక్షితులైన లెక్చరర్లు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందుతుండటంతో కొంత ఆర్థిక స్థితి బాగున్నవారు కూడా ఇక్కడ చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు కూడా తాము ఏం తక్కువ కాదంటూ మంచి మార్కులు సాధిస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న కళాశాల భవనం



అదనపు తరగతి గదులు నిర్మించాల్సిన స్థలం

అరకొర తరగతి గదులు

న్యూ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మొత్తం 654 మంది విద్యార్థులు చదువుతుండగా ఈ సంవత్సరం వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ కేవలం పది తరగతి గదులు మాత్రమే ఉండటంతో ఇబ్బందిగా మారింది. అలాగే సెమినార్ హాల్ కూడా లేదు. కాలేజీ భవనంపై మరో అంతస్తు నిర్మిస్తే మరో ఐదు తరగతి గదులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నా అది కార్యరూపం దాల్చడంలేదు.

శిథిల భవనం తొలగిస్తే క్రీడాస్థలం

కాలేజీ ముందు శిథిలావస్థలో ఉన్న భవనం ప్రమాదకరంగా ఉందని జీహెచ్ఎంసీ నోటీసులు జారీ చేసింది. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి వేస్తే విద్యార్థులకు క్రీడాస్థలం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

సామాజిక బాధ్యతతో టాయిలెట్ల నిర్మాణం

ఇక్కడ విద్యార్థులకు తగినట్టుగా టాయిలెట్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న ఓ కార్పొరేట్ ఆస్పత్రి సామాజిక బాధ్యతతో వాటిని ఆధునీకరించి అందుబాటులోకి తెచ్చింది. అదనంగా మరలా నూతన టాయిలెట్లను ప్రభుత్వం నిర్మిస్తుంది.

కోఎడ్యుకేషన్ చేస్తే సంఖ్య పెరుగుతుంది

కాలేజీలో కేవలం బాలురు మాత్రమే చదువుతున్నారు. కోఎడ్యుకేషన్ చేస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అదనపు తరగతులు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఏమైనా సమావేశాలు నిర్వహించాలంటే హాల్ లేక ఇబ్బందిగా ఉంది.
- ప్రభాకర్ రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్

సౌకర్యాలు కల్పించాలి



విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న ప్రభుత్వ కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నప్పటికీ సౌకర్యాలు మెరుగుపరచాలి.
- షణ్ముక్, ఏబీవీపీ నాయకుడు

22న ఇంపీరియల్ గార్డెన్‌లో ఎగ్జిబిషన్

- ఎంపీ ఈటల రాజేందర్

సికింద్రాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి పదకొండు సంవత్సరాలు పూర్తి కావటం, మల్కాజ్‌గిరిలో ఎంపీగా గెలిచి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 22న సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. మోదీ సర్కార్ సాధించిన విజయాలను ఇంటింటికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌తో కలిసి పరిశీలించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో తనను గెలిపించిన ప్రజల కోసం కేంద్రం నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. దేశాన్ని గొప్ప ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది ప్రపంచంలోనే భారతదేశానికి గొప్ప గుర్తింపు తీసుకువచ్చిన నాయకుడిగా మోదీ చరిత్రలో నిలిచారని తెలిపారు. 22న ఇంపీరియల్ గార్డెన్‌లో వికసిత భారత్ నినాదంతో ముందుకు వెళ్లుతున్న కేంద్రప్రభుత్వం చేస్తున్న పనులకు సంబంధించి ఎగ్జిబిషన్లో పొందుపరచనునట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ తదితరులు

గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయాలి



ఇందిరానగర్‌కాలనీ రోడ్డు నంబరు-2లో గుంతలు పడిన రోడ్డుపై మురుగు

బౌద్ధనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్ కాలనీ రోడ్డు నంబర్-2లో గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గుంతలు పడిన రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, దీంతో అనారోగ్యాల బారిన పడే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కార్పొరేటర్ చొరవ తీసుకుని గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

అడ్డగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదులుగా విధులు నిర్వహిస్తున్న పి.నారాయణ, శైలేష్‌లను కొందరు వ్యక్తులు కిడ్నాప్‌కు పాల్పడ్డారని వీరిని కఠినంగా శిక్షించాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి డిమాండు చేశారు. దీనిని పురస్కరించుకుని సోమవారం సికింద్రాబాద్ సివిల్ కోర్టు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం కోసం వాదించే న్యాయవాదులకే రక్షణ లేకుండాపోయిందని, వారికి రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జనార్థన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సంయుక్త కార్యదర్శి వినోద్‌కుమార్, మహిళా రిప్రజెంటివ్ మహేశ్వరి, కోశాధికారి సురేష్, స్పోర్ట్స్ కల్చరర్ కార్యదర్శి స్వామి, సంజయ్ కుమార్, సంతోష్ కుమార్, పావని, సమత, అనితలు పాల్గొన్నారు

బాలికలందరికీ అడ్మిషన్ ఇవ్వాలి

మారేడుపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : ఐదవ తరగతిలో ప్రవేశానికి గురుకుల పాఠశాలలో ప్రవేశపరీక్ష రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురుకులంలో చేరడానికి కళాశాల యాజమాన్యం ఒప్పుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం ఆరోపించింది. ఈ మేరకు సోమవారం మహేంద్రహిల్స్‌లోని ఎస్సీ బాలికల గురుకుల సాంఘిక సంక్షేమ విద్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణులైన బాలికలను విద్యాలయంలో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు, ఆరు, ఏడో తరగతుల్లో చేర్చుకోవడం లేదని లేదని చెప్పడం సరికాదని అన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా మీ ఇంటి పరిసర పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకోవాలని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు.



ఎస్సీ గురుకుల హాస్టల్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తప్పుడు ప్రచారం చేయవద్దు

మహేంద్ర హిల్స్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో నూతనంగా నీట్ ఫౌండేషన్ కళాశాలగా మార్చడానికి నిర్ణయించాం. అకాడమిక్ ఇయర్‌లో 2025-26 నూతన విధానం ఆరంభించాం. అందుకు జరిగే మార్పుల్లో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ బైపీసీ ఎన్ఈఈటీ ఎగ్జామ్ వరకు ఐదు సంవత్సరాలు నిపుణులతో శిక్షణ ఇప్పించామని, వంద శాతం ఎంబీబీఎస్ సీట్లు సాధించే దిశగా ప్రణాళికలు చేపట్టాం. 8వ తరగతిలో 120 సీట్లు కేటాయిస్తూ గురుకుల హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి సెలెక్ట్ చేసిన తర్వాతనే ఈ గురుకుల హాస్టల్‌లో కేటాయించడం జరిగింది. తమ స్కూల్‌పై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు.
- ఎస్.సునీత, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, మహేంద్రహిల్స్

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన



కుమార్తెతో ఉపాధ్యాయురాలు

రాంగోపాల్‌పేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన తో పాటు అత్యుత్తమ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పనిచేస్తారు. అందువల్ల ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల(ఓల్డ్)లోని ప్రాంగణంలోని డిజిటల్ పాఠశాల అయిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 6 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు తన పిల్లలను ఇక్కడే చదివిస్తోంది. తమను తామే నమ్మకుంటే ఇతరులు ఎలా నమ్ముతారని, అందువల్ల తమ పిల్లలను ఇక్కడ చదివిస్తున్నానని ఆమె అన్నారు. ఇక్కడ యూనిఫామ్, షూస్, పుస్తకాలు ఉచితంగా లభ్యమవుతాయని, తల్లిదండ్రులు నిరభ్యంతరంగా తమ చిన్నారులను ఇక్కడ చేర్పించవచ్చన్నారు.

రైలుకింద పడి మెడికల్ రిప్రజెంటేటివ్ ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో రైలు కిందపడి మెడికల్ రిప్రజెంటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిపురలో నివాసం ఉంటున్న కె.అనిల్(38) ఫార్మసీ కంపెనీలో మెడికల్ రిప్రజెంటర్. అతనికి భార్య, ఇద్దరు సంతానం. కొంతకాలంగా కుటుంబ కలహాలతో సతమతమవుతున్నాడు. సోమవారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

- మరో సంఘటనలో 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి డబీర్‌పుర - ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడిపై దాడి.. నగదు, సెల్‌ఫోన్ చోరీ

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడిని కొట్టి నగదు, సెల్‌ఫోన్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాలప్రకారం. ఈనెల 9న వారసిగూడకు చెందిన కనకయ్య(50) ఎంఎంటీఎస్ రైలు ఎక్కడానికి మలక్‌పేట రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. గుర్తు తెలియని ఇద్దరు కనకయ్యను కొట్టి అతని జేబులోని సెల్‌ఫోన్, రూ.800 నగదు లాక్కొని పారిపోయారు. సోమవారం కనకయ్య కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తి రిమాండ్



మహ్మద్ ఆదిల్

పీర్జాదిగూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయితో పట్టుబడిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోల్‌కత్తాకు చెందిన మహ్మద్ ఆదిల్(38) చెంగిచర్ల మేకల మండిలో లేబర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా హనుమాన్‌నగర్ కాలనీలో అనుమానాస్పదం గా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా తన వద్ద ఉన్న 30 గ్రాముల గంజాయిని స్వాధీన పరుచుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శెట్టి బలిజ సంఘం ప్రతినిధులు

శెట్టి బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

బేగంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శెట్టి బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి సోమవారం ప్రజా భవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ జాబితాలో శెట్టి బలిజ కులం ఉందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీసీ జాబితా నుంచి తొలగించారని వారు పేర్కొన్నారు. టైపు మిస్టేక్ వల్ల పొరపాటు జరిగిందని తెలంగాణ బీసీ కమిషన్ అభిప్రాయపడిందని, దీనిని సరిదిద్దాలని బీసీ శాఖ కార్యదర్శికి కమిషన్ మెంబర్ సెక్రటరీ లేఖ రాశారని సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, గణపతి, ప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చిన్నారెడ్డి పేర్కొన్నారు.



ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రజక ప్రతినిధులు

ధర్నాకు రజకులు తరలిరావాలి

మారేడుపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారుల సమస్యలు, ఆరు డిమాండ్ల సాధన కోసం జూన్ 17న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు తరలిరావాలని రజక వృత్తిదారుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం సిక్‌విలేజ్ దోబీఘాట్‌లో సంఘ సభ్యులతో కలిసి ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రజకుల ఉచిత విద్యుత్ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు బాబు, సంఘాల నాయకులు కృష్ణ, పరశురాం, ఎల్ ఆర్ ఎల్లయ్య, సత్తయ్య, గంగాధర్ రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత చేపట్టినా.. పేరుకుపోతున్న చెత్తాచెదారం

బౌద్ధనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌ల్లో ఉన్న నాలాలో పూడికతీత పనులు చేపట్టారు. గత పదిహేనురోజుల క్రితం నాలాలోని మట్టి, చెత్తాచెదారాన్ని తీశారు. వారాసిగూడ, మహ్మద్‌గూడ, అన్నానగర్, పుల్లయ్యబావి తదితర ప్రాంతాల్లో నాలాలో చెత్తచెదారం లేకపోవటంతో నీరు సాఫీగా వెళ్తుంది. సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్ ఫ్రైడేమార్కెట్ వద్ద నాలాలో పూడికతీత పనులు చేపట్టినా అక్కడక్కడా చెత్తాచెదారం పేరుకుపోయి ఉంది. నాలాలో పూడికతీత తీసిన రెండు, మూడురోజులకే చెత్త పేరుకుపోతుందని స్థానికులు వాపోతున్నారు. చాలా మంది వ్యాపారస్తులు, కార్ఖానాల వాళ్లు అర్ధరాత్రులు నాలాలో వ్యర్థాలను పడవేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



శ్రీనివాస్‌నగర్ ఫ్రైడే మార్కెట్ వద్ద నాలాలో చెత్తచెదారం



వారాసిగూడ పుల్లయ్యబావి వద్ద నాలాలో సాఫీగా వెళుతున్న నీరు

చెత్తను తొలగించాలి

నాలాలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలి, లేని పక్షంలో చెత్తచెదారం విపరీతంగా పేరుకుపోయి భారీవర్షాలు కురిసినప్పుడు వర్షపు ఇళ్లలోకి చేరుతుంది. దీంతో పాటు చాలామంది రాత్రి సమయాల్లో నాలాలో వ్యర్థాలను పడవేయటం వల్ల నాలాలు పూడుకుపోతున్నాయి.



- నవీన్ ముదిరాజ్

'బీసీల రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలి

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీసీల 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోవడం లేదని కుంటి సాకులతో తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు సమస్య తేల్చకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. రాజ్యాంగబద్ధమైన అధికారం ఉన్నప్పటికీ పెంచిన రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎందుకు జీవో జారీ చేయడం లేదని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జి.అనంతయ్య, రాందేవ్‌మోదీ, జిల్లపల్లి అంజి, జి.మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, నిమ్మల వీరన్న, జి.కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.